www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 మార్చి 2025
5
పశ్చిమ గోదావరి



## ఉప కారాగారం సందర్శన

**నరసాపురం :** నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి శనివారం సాయంత్రం ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. జైల్ ముద్దాయిలకు సంబంధిత పోలీస్ వారి నుంచి తదుపరి వాయిదాలు తెలుస్తున్నది లేనిదీ, ఉచిత న్యాయ సలహాదారుల పనితీరును, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుల పనితీరును సబ్ జైల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలకు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు జైల్ ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జైళ ముద్దాయిలకు నియమించబడిన ఉచిత న్యాయ సలహాదారులందరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా మాట్లాడి తనిఖీ చేశారు. ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగాది.. ఉసూరు..!




**మండుతున్న నిత్యావసరాల ధరలు**
**చిన్నపాటి పిండి వంట చేసుకోలేని దుస్థితిలో జనం**
**కందిపప్పు కిలో రూ.130, పప్పుల ధరలన్నీ ఆకాశంలోనే**
**ఎండుమిర్చి కిలో రూ.200, చింతపండు రూ.140**
**వంటనూనె కిలో రూ.150**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఉగాది, రంజాన పండుగల వేళ జనం ఉసూరోమంటున్న పరిస్థితి నెలకొంది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య ప్రజానీకం పండుగ చేసుకోలేని దుస్థితి ఏర్పడింది. ఆదాయాలు తక్కువగా, ధరలు భారీగా ఉండటంతో జనం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పండుగ వస్తుందంటే సామాన్య కుటుంబాలు హడలిపోతున్నాయి. చిన్నపాటి పిండివంట చేయాలన్నా ఖర్చును తట్టుకోలేక భయపడిపోతున్నారు. దీంతో పండుగ రోజు ఎటువంటి సందడీ లేకుండాపోయింది. ఉగాది, రంజాన్ పండుగలు ప్రజలకు అత్యంత ముఖ్యమైనవి. తెలుగు క్యాలెండర్ ప్రకారం ఉగాది నుంచి నూతన సంవత్సరం ఆరంభమవుతున్నట్లు లెక్క. ఉగాది రోజు వేప పువ్వు పచ్చడి, బూరులు, గారెలు, పాయసం, పులిహోర, బొబ్బట్లు, పాలన్నం వంటి అనేక వంటకాలు చేసుకోవడం ఆనవాయితీ. ఆ రోజు వండుకున్న వంటకాలను, ఉగాది పచ్చడిని చుట్టుపక్కల ఉన్న స్నేహితులతోపాటు తమ బంధువులకు ఇచ్చి ఉగాది శుభాకాంక్షలు చెప్పుకుంటారు. అలాంటి ఉగాది పండుగ ధరల తాకిడికి కళ తప్పిన పరిస్థితి నెలకొంది. కిలో కందిపప్పు రూ.130 పలుకుతోంది. పచ్చి శనగపప్పు రూ.105, చింతపండు రూ.140, ఎండుమిర్చి రూ.200, పెసరపప్పు రూ.120, వేపుడు శెనగపప్పు రూ.105 ఇలా పప్పుల ధరలన్నీ కిలో రూ.వంద నుంచి రూ.150 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె ధర కిలో రూ.150కు చేరింది. నలుగురు కుటుంబసభ్యులు ఉన్నవారు చిన్నపాటి పిండివంట చేయాలన్నా రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేలు ఖర్చవుతోంది. కూరగాయల ధరలూ అదేవిధంగా ఉన్నాయి. దీంతో పండుగ రోజు పిండివంట పేరు చెబితేనే జనం వణికిపోతున్నారు. దీంతో ఉగాది పచ్చడి, పులిహోరతోనే పండుగ ముగించేసే పరిస్థితి ఏర్పడింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు ఏయేటికాయేడు పెరుగుతూనే ఉన్నాయి. వంటగ్యాస్ సిలిండర్ ధర సైతం రూ.830 ఉంది.

**ఆదాయాలు అంతంతే.. ధరలు పైపైకి**

గడిచిన పదేళ్లలో ధరలు పెరిగినట్లుగా ఆదాయాలు మాత్రం పెరగలేదు. పదేళ్ల క్రితం రూ.పది వేలు జీతం తీసుకున్న ప్రయివేటు ఉద్యోగికి రూ.వెయ్యి, రెండు వేలు మాత్రమే పెరిగింది. అప్పట్లో వంటనూనె కిలో రూ.70 ఉండగా ఇప్పుడు వందశాతానికిపైగా పెరిగి రూ.150కు చేరింది. ఏ వస్తువు ధర చూసినా అదే పరిస్థితి నెలకొంది. వంటగ్యాస్, నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో టిఫిన్, భోజనం ధరలు సైతం భారీగా పెరిగాయి. గతంలో భోజనం రూ.70లోపు ఉంటే ఇప్పుడు రూ.120కుపైగా చేరింది. టిఫిన్ ధరలది అదే పరిస్థితి. ప్రభుత్వ శాఖాల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు సైతం రూ.15 వేలలోపే ఉన్నాయి. స్కూల్ ఫీజులు, వైద్యం ఖర్చులు సైతం గడిచిన పదేళ్లలో 200 శాతానికిపైగా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సైతం లీటర్ రూ.వందకుపైగా చేరిపోయాయి. దీంతో సామాన్య ప్రజానీకం ఉగాది, రంజాన్, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి వంటి ముఖ్యమైన పండుగలు సైతం ఆనందంగా జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెగ ఉపన్యాసాలు ఇచ్చే మోడీ ప్రభుత్వం సామాన్యులను పండుగలకు దూరం చేసిన పరిస్థితి ఉంది. ఆదాయాలు తగ్గిపోవడంతో సామాన్యుల్లో కొనుగోలు శక్తి పడిపోతుంది. ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని తీవ్రంగా కుదిపేస్తోంది. పౌష్టికాహారం సైతం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అనేక అనారోగ్య సమస్యలు సైతం జనాన్ని చుట్టుముడుతున్నాయి. దీన్నిబట్టి మోడీ ప్రభుత్వం పాలన ఏవిధంగా సాగిస్తుందో వేరే చెప్పనక్కర్లేదు.

# మా ఊరి బడిని మూయొద్దు

**సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద గొందిమూలవాసుల ధర్నా- డిఇఒకు వినతి**

**ప్రజాశక్తి - నరసాపురం**




సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మండలంలోని వేములదీవి పడమర పంచాయతీ పరిధిలోని గొందిమూల ప్రాథమిక పాఠశాలను కాపులకొడప ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ గొందిమూల గ్రామస్తులు స్థానిక మిషన్ హైస్కూల్‌లో డిఇఒ క్యాంపు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిఇఒ నారాయణను కలిసి సమస్యను వివరించారు. దీనిపై డిఇఒ నారాయణ స్పందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం లేకుండా ఏ పాఠశాలనూ విలీనం చేయబోమని, అదేవిధంగా గొందిమూల పాఠశాలను కూడా విలీనం చేయబోమని హామీ ఇచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం గ్రామస్తులు కృషి చేయాలని కోరారు. తొలుత సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ కౌరు రమేష్, గ్రామ పెద్దలు కవురు రామారావు, బొక్కా సోమేశ్వరరావు, కౌరు రామచంద్రరావు, కౌరు సత్యనారాయణ, బొక్కా దుర్గరాజు, తుమ్మా సురేష్, పోతిమేను దుర్గ, కవురు తులసి, పూదిండి అంజమ్మ, తుమ్మ మాధవి తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

# ఇళ్ల స్థలాలివ్వాలని బొండాడవాసుల ధర్నా

**ప్రజాశక్తి - కాళ్ల**




తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

బొండాడ మెయిన్ రోడ్డులో ఇళ్లు కూల్చివేయడంతో నిరాశ్రయులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ హెచ్చరించారు. తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బొండాల పేదలు, నిర్వాసితులు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# విద్యుత్ భారాలు ఉపసంహరించాల్సిందే

**సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు**

**ప్రజాశక్తి - తణుకు**



తణుకు : విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినతి అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజలపై విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వేల్పూరు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని, సెకీ ఒప్పందం రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ స్కేల్ విధానం రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, పట్టణ కార్యదర్శి అజయకుమారి మాట్లాడుతూ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి భిన్నంగా అధికారంలోకొచ్చాక పలురూపాల్లో విద్యుత్ భారాలను మోపుతుందని విమర్శించారు. ఈ విధానాలను వెనక్కి తీసుకోకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, తరుణ్, సాయిబాబా, రమేష్, ఉష, కడలి వీర్రాజు, గుబ్బల గోవిందరావు, రాజు, శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** ప్రజలపై విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని, తక్షణం స్మార్ట్‌మీటర్ల బిగింపును, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన జగన్నాథపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు వేయడంతో గత ప్రభుత్వానికంటే తామేమీ తీసిపోమంటూ కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపుతుందన్నారు. టైమ్ ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని, రైతుల బోర్లకు మీటర్లు బిగించే ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్నాథపురం సిపిఎం గ్రామ కార్యదర్శి కండెల్లి విజయ, నేతలు పీల గాదినాయుడు, కండెల్లి రమేష్‌బాబు, జి.వెంకటేశ్వరరావు, కోన వర నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**తణుకు రూరల్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం నాయకులు బళ్ల చిన వీరభద్రరావు కోరారు. సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని దువ్వలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపి షిఫ్ట్ ఆపరేటర్ బండారు శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, తూము శ్రీను, నీలం వెంకట బసవయ్య, మేకా వీరబాబు, ఎన్.స్వామి, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తిపన్ను పెంపును విరమించుకోవాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్**

**ప్రజాశక్తి - భీమవరం**



ఏప్రిల్ నుంచి ఆస్తి పన్ను పెంపు యోచనను వెంటనే విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను వసూళ్లు చేసేవారన్నారు. గత ప్రభుత్వం 2020లో కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి లొంగి ఆస్తి విలువ ఆధారంగా పన్ను వసూలు చేశారని తెలిపారు. ఆనాడే సిపిఎం దీనిని వ్యతిరేకించిందన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా ఆనాడు వ్యతిరేకించిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకొచ్చాక అదే విధానాన్ని అమలు చేయడం ప్రజలను మోసగించడమేనన్నారు. జిఒ నెం.198 ప్రకారం ఆస్తిన్నును ఏటా 15 శాతం చొప్పున పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టం వచ్చిన నాటి నుండి నేటికి ఆస్తిపన్ను వంద శాతం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీని మినహాయింపు ఇస్తూ ఇచ్చిన జిఒను మే నెలాఖరు వరకూ అమలు చేయాలని కోరారు.

# లేసు అల్లికలు నాణ్యంగా ఉండాలి

**లేస్ పార్కు సందర్శనలో కలెక్టర్ నాగరాణి**

**ప్రజాశక్తి - నరసాపురం**




సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

లేసు అల్లికలు ప్రపంచంలోనే మేటిగా నిలిచేలా మంచి నాణ్యతతో తయారుచేస్తే, మెరుగైన మార్కెటింగ్ లభిస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలోని సీతారాంపురం లేస్ పార్కును జిల్లా కలెక్టర్ చదరవాడ నాగరాణి సందర్శించారు. ఎగుమతులు, దిగుమతులు కార్యకలాపాలు నిర్వహించే బాంబే ఎగ్జిమ్ బ్యాంకు సౌజన్యంతో లేస్ అల్లికదారులకు మెరుగైన శిక్షణను కల్పించి, శిక్షణను పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందించే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత లేస్ పార్క్‌లో ఏర్పాటుచేసిన లేసు అల్లికలలో నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. నేటి నుంచి ప్రారంభించిన తొలి బ్యాచ్‌లో 20 మంది మహిళలకు లేసు అల్లికలలో శిక్షణను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం ఎగ్జిమ్ బ్యాంక్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అవుట్ రీచ్-కమ్-కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కార్యక్రమానికి హాజరై ఇప్పటికే లేసు అల్లికలలో శిక్షణ పొందిన మహిళలను ఉద్దేశించి కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నిత్యం ఉపయోగించే వస్తువులను లేసు ఉత్పత్తులతో తయారు చేస్తే మార్కెటింగ్ బాగుంటుందని సూచించారు. ఎక్కడో బాంబేలో ఉండే ఎగ్జిమ్ బ్యాంక్ నరసాపురంలోని మన లేసు ఉత్పత్తులను ఎంపిక చేసుకొని శిక్షణ, మార్కెటింగ్ అందించడానికి ముందుకు రావడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఇప్పటికే నరసాపురం లేసుకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చే జిఐ గుర్తింపు సర్టిఫికెట్‌ను పొందడం జరిగిందన్నారు. గుర్తింపుకు కొదవలేదని అయితే నాణ్యతతో కూడిన నిత్యవసర వస్తువుల వినియోగ అల్లికలకు మంచి మార్కెటింగ్ ఉంటుందని, తద్వారా మంచి ఆదాయం కూడా లభిస్తుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో ఇప్పటి వరకు మీరందరూ శిక్షణను తీసుకున్నారని, అల్లికకు రంగు దారాల ఎంపికలో నైపుణ్యం చూపించాలన్నారు. జిల్లా యంత్రాంగం పరంగా మీకు అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చివరిగా శిక్షణ పూర్తి చేసుకున్న లేసు అల్లికదారులకు సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, లవ్లీ హుడ్స్ డిపిఎం, లేస్ పార్క్ మేనేజర్ ఎస్.కుసుమకుమారి, ఎగ్జిమ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ధర్మేంద్ర సచాన్, చీఫ్ మేనేజర్ కౌశలాల్ గిరి, ఎటిడిసి ప్రిన్సిపల్ బి.విజయలక్ష్మి, సర్పంచి ఎం.భారతి పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

**పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి**

**ప్రజాశక్తి - గణపవరం**



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గోపీమూర్తి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు అఖండ విజయాన్ని అందించినందుకు ఉపాధ్యాయ, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యలు మరింత క్షుణ్ణంగా తెలుసుకునేందుకు జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి, ప్రయివేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ఆదుకోవాలని కౌన్సిల్‌లో కోరామన్నారు. ప్రయివేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులివ్వాలని, సెలవులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేశవరంలో దాతల సహకారంతో నిర్మించిన బెయిలీ వంతెనను పరిశీలించి దాతను అభినందించారు. దీనిస్థానంలో శాశ్వత వంతెన నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, నేతలు వోతా ఆంజనేయులు, ఎం.పెద్దిరాజు, హెచ్‌డి.ప్రసాద్, కె.నాగభూషణం, నక్కా సత్యనారాయణ, ఇ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

# పోక్సో చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి - నరసాపురం**

18 సంవత్సరాల లోపు బాలబాలికలందరూ కొన్ని కొన్ని సందర్భాల్లో లైంగిక దాడికి గురవుతున్నారని నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి విచ్చేసి పోక్సో చట్టం గురించి మాట్లాడారు. అదేవిధంగా సోషల్ మీడియా, సెల్‌ఫోన్, యూట్యూబ్ ద్వారా పిల్లలను నేరాలకు ప్రేరేపిస్తున్నాయని, 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక దాడులు చేసే వారికి వారు చేస్తున్నది నేరం అని తెలియక వారి మానసిక స్థితి కూడా సరిగ్గా లేని విధంగా వారు అనేక రకాల ప్రలోభాలకు లోనై ఈ లైంగికదాడులకు పాల్పడుతున్నారని తెలియజేశారు. అదే విధంగా కొంతమంది తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల వల్ల ఇతర ప్రాంతాలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లే క్రమంలో తమ పిల్లలను తెలిసిన వాళ్ల దగ్గర ఉంచి చదువు నిమిత్తం ఉంచడం వల్ల ఆ పిల్లలను సంరక్షించవలసిన వారే వారిపై కొన్ని సందర్భాల్లో లైంగిక దాడులు చేస్తున్నారన్నారు. దీనంతటికీ కారణం తల్లిదండ్రులకు, పిల్లలకు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం అన్నారు. చదువు లేక సమాజంలో వారికి జరిగిన అన్యాయాన్ని గాని, అవమానాలు గాని పోలీస్ కంప్లైంట్ ద్వారా, కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని విషయం వాళ్లకు తెలియని వారు చాలామంది ఉన్నారన్నారు. పోక్సో చట్టం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, పట్టణ ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి, ప్యానెల్ లాయర్ పద్మజ, న్యాయవాది టి.వెంకటేశ్వరరావు, మెప్మా మేనేజర్ ఎన్.రత్నాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్ కృష్ణ ప్రసాద్, డ్వాక్రా మహిళలు, లీడర్లు పాల్గొన్నారు.

# ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి కృషి

**రంజాన్ తోఫా పంపిణీలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ**




ముస్లింలకు తోఫా పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

**ప్రజాశక్తి - తణుకు**

ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ప్రయోజనాలు కాపాడటంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించడానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకులో ఎంఎల్ఎ రాధాకృష్ణ ఆర్థిక సహాయంతో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే విధంగా అభివృద్ధి పరుగులు పెట్టిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు. ముఖ్యంగా ముస్లిం, మైనార్టీలకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు రద్దు చేసి బడ్జెట్‌లో నిధులు అరకొరగా చేశారన్నారు. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యంగా రంజాన్ తోఫా విదేశాల్లో విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం, మక్కా వెళ్లేందుకు ఆర్థిక సాయం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే వాటిని రద్దు చేసి ముస్లిం, మైనార్టీలను నిరాశకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇమాంలు, మౌజింలకు గౌరవవేతనం అందించడం, ముస్లిం, మైనార్టీల కోసం బడ్జెట్‌లో రూ.5.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. షాదీఖానాల అభివృద్ధి, పిల్లలు విదేశాల్లో చదువుకోవడానికి, మక్కా వెళ్లే వారికి ఆర్థిక సహాయం చేసేందుకు కేటాయింపులు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** ప్రతి సంవత్సరం ముస్లిం పేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం హర్షణీయమని టిడిపి జిల్లా టిడిపి మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జానీ చెప్పారు. పాలకొల్లు మసీదులో శనివారం వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు సారథ్యంలో 50 మంది మహిళలకు 50 వేల ఖరీదైన నిత్యావసర సరుకుల ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగాలకు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా అనేక రాష్ట్రాల్లో ఖర్చు చేస్తున్న రామరాజు సేవలు వర్ణణాతీతం అన్నారు. ముస్లిం కమ్యూనిటీలో ఎక్కువ మంది మహిళలు పేదలు ఉంటారని, వారికి ప్రతి ఏడాది 50 మందికి నిత్యావసర సరుకులు ఇవ్వడం హర్షణీయమన్నారు. డిటిడిసి బాబు, కోటి రామచంద్ర రాజు, పి.బుద్ధరాజు పాల్గొన్నారు.




పాలకొల్లు : మసీదులో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

# ఆశ.. నిరాశ..!

ఆశ.. నిరాశల నడుమ జిల్లాలోని నేతలు, జనం కొట్టుమిట్టాడుతున్నారు. ఎఎంసి ఛైర్మన్ల జాబితా ప్రకటించడంతో కొందరు నేతల్లో సంతోషం నింపగా మరికొందరిలో నిరుత్సాహం చోటుచేసుకుంది. సిఎం పర్యటనలో నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించినా ఎప్పటిలోపు పునరావాసం చూపిస్తారనేది తప్ప ఇతర అంశాలేవీ చర్చకు రాకపోవడంతో వారంతా పెదవివిరుస్తున్నారు. ఇక ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికలు రణరంగాన్ని తలపించగా నేతల తీరు ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే రీతిలో ఉందనే వ్యాఖ్యానాలు విన్పించాయి.

రెండు జిల్లాల్లో ఐదు మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో రెండు జనసేనకు దక్కగా మిగిలిన మూడు టిడిపి నేతలకు కట్టబెట్టారు. జనసేనకు దక్కిన రెండు ఎఎంసి పదవులు జనసేన ఎంఎల్ఎలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనివే కావడం విశేషం. ఈ ఐదు నియోజకవర్గాల్లోనే ఆశావహులైన కూటమి నేతలు తమకు పదవులు దక్కేదెప్పుడో అంటూ నిట్టూర్పు విడుస్తుండగా, రెండు జిల్లాల్లోని మిగిలిన నియోజకవర్గాల్లో ఎఎంసి పదవుల ఆశావహులు తమకు పదవులెప్పుడు ప్రకటిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సిఎం చంద్రబాబు మరోసారి పోలవరంలో పర్యటించారు. పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఈసారి నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించారు. నిర్వాసితులు కూడా తమ గోడును చెప్పుకునే ప్రయత్నం చేశారు. అయితే యువతకు సంబంధించి పరిహారం, ప్యాకేజీ అమలుకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు, ఏలూరు జిల్లాకు మధ్య వ్యత్యాసంపై ప్రస్తావించి కటాఫ్ తేదీ మార్చాలని కోరారు. అయితే దానిపై స్పష్టత ఇచ్చిన పరిస్థితి లేదు. అయితే 2027 డిసెంబర్ నాటికి పోలవరం పనులు పూర్తి చేసి ప్రాజెక్టు నీళ్లు నింపుతామని ప్రకటించడంతోపాటు 2026 డిసెంబర్ నాటికి పునరావాసం పూర్తి చేస్తామని ప్రకటించారు. అయితే నిర్వాసితుల ప్రధాన డిమాండ్ మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించాలని, కాంటూరు లెక్కలు శాస్త్రీయంగా లేనందున మరోసారి




సర్వే నిర్వహించాలనే డిమాండ్లపై సిఎం నుంచి ఎటువంటి స్పందనా లేకుండా పోయింది. నత్తనడకన సాగుతున్న పరిహారం, ప్యాకేజీ సొమ్ము జమ, పునరావాస కాలనీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చేపట్టే చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ఇప్పటికీ ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీరుపై నిర్వాసితుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2026 డిసెంబర్ నాటికి మరికొంతమందికి పరిహారం, ప్యాకేజీ ఇచ్చి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలిస్తారా అనే ఆందోళన వారిలో నెలకొంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వడంతోపాటు ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగేలా పరిహారం, ప్యాకేజీ ఇస్తేనే వారి త్యాగానికి పాలకులు సముచిత రీతిలో గుర్తింపు ఇచ్చినట్లవుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో రెండు ఎంపిపి స్థానాలకు, ఏలూరు జిల్లాలో రెండు వైస్ ఎంపిపి స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ తేదీలు ప్రకటించింది. దాని ప్రకారం ఎన్నికల అధికారులు ప్రక్రియకు అత్తిలి, యలమంచిలి మండల పరిషత్ కార్యాలయాల్లో శ్రీకారం చుట్టారు. రెండుచోట్ల వైసిపి ఎంపిటిసిలే మెజార్టీ ఉండటంతో ఎలాగైనా ఆ పదవులు దక్కించుకోవాలని అధికార టిడిపి ముందస్తుగా చేసిన ప్రయత్నాలన్నీ బెడిసి కొట్టాయి. దీంతో ఎన్నికల వాయిదాకు పన్నాగాలు పన్నిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్తిలిలో వైసిపి ఎంపిటిసిలు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితులున్నా పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక యలమంచిలిలోనైతే ఎన్నికల అధికారి తీరే వివాదాస్పదంగా మారింది. కోరం ఉన్నా ఎన్నికల అధికారి గుండెనొప్పి అంటూ విధులకు దూరం కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏదేమైనా నాడు వైసిపి నేతలు వ్యవహరించిన అప్రజాస్వామిక తీరునే ఎంపిపి ఎన్నికల్లో టిడిపి నేతలు వ్యవహరించారనే అపవాదు మాత్రం మూటగట్టుకున్నారనడంలో ఎటువంటి సందేహం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

## స్వయం ఉపాధి దరఖాస్తుల పరిశీలన

**ఉండి :** అగ్రవర్ణాలు బడుగు బలహీన తరగతుల శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన చంద్రన్న స్వయం ఉపాధి పథకం దరఖాస్తులను ఏప్రిల్ 2, 3 తేదీలలో పరిశీలించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చంద్రన్న స్వయం ఉపాధి పథకానికి 1250 మంది దరఖాస్తు చేసుకున్నారని బ్యాంకు అధికారులు, ఎంపిడిఒ సమన్వయంతో రెండు, మూడు తేదీల్లో పరిశీలించి అర్హులైన వారికి స్వయం ఉపాధి సబ్సిడీ లోన్లను మంజూరు చేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**కాళ్ల :** చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పథకం కింద వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీపై రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఏప్రిల్ 2, 3 తేదీల్లో బిసి, బ్యాంక్ అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ స్వాతి శనివారం తెలిపారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా మండలంలో 1100 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె తెలిపారు.

## విద్యార్థులకు అభినందన

**నరసాపురం :** సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న బొడ్డు హిందూ, కొదురి అఖిల ఒకే దేశం-ఒకే ఎన్నిక అనే అంశంపై జిల్లా స్థాయి వికసిత్ భారత్ యువ పార్లమెంట్ 2025 సదస్సులో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల నిర్వహణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మద్దతుతో విద్యార్థులు దీన్ని సాధించారు. ఈ కార్యక్రమం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో ఘనంగా నిర్వహించారు. కళాశాల నిర్వహణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు అభినందించారు. డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థుల సామాజిక బాధ్యతను నెరవేర్చడంతో పాటు మంచి నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారని ప్రశంసించారు. కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కోశాధికారి కెవి.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు విస్స మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు

**ఉండి :** ఉగాది పురస్కరించుకుని కోరంద రామచంద్రస్వామి ఆలయం, వీరాంజనేయ స్వామి ఆలయం కమిటీల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది పురస్కరించుకుని మహిళలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన ఐదుగురు మహిళలకు బహుమతి ప్రదానం చేశారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సన్నిధి రాజు చలపతిరావు, కనిగళ్ల బ్రహ్మానందం, కాగిత బుజ్జి, దాసరి వరదరాజు, మహిళలు పాల్గొన్నారు.

## సంసిద్ధ్ స్కూల్లో క్రీడోత్సవం

**నరసాపురం :** సంసిద్ధ్ స్కూల్లో వార్షిక క్రీడోత్సవాన్ని ఛైర్మన్ వాసా శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డిఒ) దాసిరాజు విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తులో క్రీడల ప్రాముఖ్యతను ఆయన వివరించి, క్రమశిక్షణ, టీమ్ వర్క్, పట్టుదలతో జీవితంలో విజయం సాధించవచ్చని ప్రేరేపించారు. క్యాంపస్ మేనేజర్ మెట్ల సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, అధ్యాపకులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వందమీటర్ల పరుగులు, రిలే రేసులు, ఇతర క్రీడల్లో విజేతలకు మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేసి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ వెంపటాపు లావణ్య చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ఉత్సాహం, క్రీడాస్ఫూర్తి ఉండాలని తెలిపారు.

## ఇళ్ల స్థలాలు కేటాయించాలి : సిపిఎం

**భీమవరం టౌన్ :** ఇళ్లు లేనివారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇవ్వాలని, ఇళ్లు కట్టుకోలేని వారికి గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం రూరల్ దెయ్యాలు తిప్ప గ్రామంలో ఎస్సి పేటలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయించి గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారే తప్ప ఇంతవరకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇవ్వలేదని అన్నారు. ఒక గృహంలో రెండేసి, మూడేసి కుటుంబాలు నివసిస్తున్నారని, ఇప్పటికైనా లబ్ధిదారులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి గృహాలు నిర్మించుకోలేని వారికి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంధి యోహాను, బీమా ఝాన్సీ, దొడ్డి స్వామి, దొడ్డి కుమారి పాల్గొన్నారు.

## జెడ్పి హైస్కూల్‌కు రూ.1.71 కోట్లు మంజూరు : ఎంఎల్ఎ

**మొగల్తూరు :** మొగల్తూరు గ్రామంలోని జెడ్పి హైస్కూల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.71 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెషీ అధికారుల సమక్షంలో నిర్వహించిన గ్రామ అభివృద్ధి సభలో మొగల్తూరు గ్రామ ప్రజలు తమ గ్రామంలో గల జెడ్పి హై స్కూల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ విషయమై ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో ప్రత్యేకంగా చర్చించగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించారన్నారు. జెడ్పి పాఠశాల అభివృద్ధికి 1.71 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**పాలకొల్లు రూరల్:** గత ప్రభుత్వంలో రైతుకు ఉపయోగపడే ఒక్క గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయలేక పోయారని, టిడిపి హయాంలో వేసిన రోడ్లు తర్వాత మన ప్రజా ప్రభుత్వం మరలా వేసుకుంటున్నామని మంత్రి రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు మండలంలో రూ.76 లక్షలతో భగ్గేశ్వరం గ్రామంలో బ్రిడ్జి వద్ద రెండు గ్రావెల్ రహదారులకు, లంకల కోడేరు గ్రామంలో వెలివెల బ్రిడ్జి వద్ద రెండు గ్రావెల్ రహదారుల నిర్మాణాలకు శంఖుస్థాపనలు, శిలాఫలకాలను మంత్రి రామానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం అని, లాభసాటి వ్యవసాయాన్ని అందించి రైతన్నలను ఆర్థికంగా ఎదగాలన్నదే మా ఆలోచన అన్నారు. మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, ఎంపిడిఒ ఎన్ఎన్.ఉమామహేశ్వరరావు, డిఇలు సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.వెంకటనారాయణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బిల్ కలెక్టర్‌ను నిర్బంధించిన వారిపై కేసు


**తణుకు రూరల్ :** పాత కక్షల నేపథ్యంలో తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ పాత కేసులు రాజీ చేసుకోవాలని తనపై తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఒత్తిడికి పాల్పడుతున్నారని పేర్కొంటూ దువ్వ గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు బిల్ కలెక్టర్ నీలం వెంకటలక్ష్మి తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన మండల అధ్యక్షుడు చిక్కాల వేణు, గ్రామ అధ్యక్షులు శ్రీరాములు దుర్గారావులు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని గదిలో నిర్భందించి నాయకుల సమక్షంలో దుర్భాషలాడారని ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి గత పదేళ్లుగా కాంట్రాక్టు విధానంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గతేడాది తన బావ నర్సింహస్వామి, శ్రీరాములు దుర్గారావుల మధ్య జరిగిన ఘర్షణలో నర్సింహస్వామి గాయపడటంతో అప్పట్లో తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు రాజీ చేసుకోవాలంటూ తనపై మండల అధ్యక్షుడు చిక్కాల వేణు, శ్రీరాములు దుర్గారావులు ఒత్తిడి తీసుకువస్తున్నారని వెంకటలక్ష్మి చెప్పారు. దీంతో అప్పట్లోనే మంగళగిరి జనసేన కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో మరింత కక్ష పెంచుకుని అప్పటి నుంచి తనను ఏదోరకంగా వేధిస్తున్నారని తెలిపారు. శుక్రవారం జరిగిన గ్రామ పంచాయతీ బోర్డు సమావేశంలో సైతం శ్రీరాములు చిన్ని తన ఉద్యోగం తీయించేయాలని కోరడంతో మిగిలిన సభ్యులు ఒప్పుకోలేదన్నారు. దీంతో సమావేశం అనంతరం చిక్కాల వేణు, శ్రీరాములు దుర్గారావులు తనకు గదిలో నిర్భంధించి కూటమి నాయకుల సమక్షంలో కేసులు రాజీ చేసుకోవాలని, లేకపోతే ఉద్యోగం తీయించేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీను సైతం ఆమె విడుదల చేశారు. ఈ సంఘటనపై తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్‌ను వివరణ కోరగా నీలం వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

**పాలకొల్లు :** మండలంలోని చింతపర్రు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఎన్.కన్నయ్య అను వ్యక్తిని పాలకొల్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియజేశారు.



# ఘనంగా పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవం


పాలకొల్లు : రోగులకు పండ్లు అందజేస్తున్న మంత్రి నిమ్మల

**ప్రజాశక్తి - పాలకొల్లు**

టిడిపి స్థాపించి కేవలం 9 నెలల్లో అధికారంలోకి తీసుకువచ్చిన కీర్తిశేషులు ఎన్‌టిఆర్ దేశానికే ఆదర్శనీయులని మంత్రి రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు, సిబ్బందికి పండ్లు, రొట్టెలు, పాలు మంత్రి రామానాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతికి సంక్రాంతి, క్రిస్టమస్, రంజాన్ ఎంత పెద్ద పండుగలో అదే స్థాయిలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం పండుగ వేడుకలు రాష్ట్రంతో పాటు మన తెలుగువారు ఉన్నచోట కూడా ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. నాడు ఎన్‌టిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నేడు ప్రపంచమంతా ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే సిద్ధాంతంతో పేదలు, బడుగు బలహీన అట్టడుగు తరగతుల సంక్షేమ పథకాలకు నాంది పలికిన ప్రజాపార్టీ అన్నారు. చంద్రబాబు ఆనాడు 2020 విజన్‌తో ప్రగతి సాధించారని, నేడు 2047 విజన్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని మంత్రి అన్నారు.

**వీరవాసరం :** బడుగు బలహీన తరగతుల అభ్యున్నతి కోసమే ఆనాడు కీర్తిశేషులు ఎన్‌టి రామారావు టిడిపిని స్థాపించారని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరవాసరం, తోలేరు, మత్స్యపురి గ్రామాలలో పార్టీ జెండాను పార్టీ అధ్యక్షులు ఎగురవేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లేపర్ల శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, రాయపల్లి వెంకట్, చింత కనకయ్య, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**కాళ్ల :** మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. కాళ్ల మండలంలోని కాళ్ల, సీసలి, పెదఅమిరం, ఏలూరుపాడు, కోపల్లె, బొండాడ గ్రామాల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.


కాళ్ల :ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సర్పంచి జగ్గరాజు

కార్యక్రమంలో పెదఅమిరం సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, కోపల్లె ఉప సర్పంచి బూడి వెంకట పర్రాలు, మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు, బొండాడ టిడిపి అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి, ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు వెంకటజగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు పాల్గొన్నారు.

**గణపవరం :** టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం టిడిపి గణపవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గణపవరంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు కూచంపూడి సురేంద్ర కుమార్ రాజు మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి టిడిపి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లి వెంకటేశ్వరరావు, షేక్ బషీర్, కాపారం చిన్న, వంటాకుల శ్రీను, రామచంద్రరాజు, కడగళ్ల చిన్న పాల్గొన్నారు.

**మొగల్తూరు :** టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని పలు గ్రామాలలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడి శెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు, బొల్లా చంటి, కొల్లాటి భోగరాజు, పంపన భగవాన్, వెలిది పుల్లారావు, డొల్లా రత్నంరాజు, పలువురు నాయకులు, అభిమానులు ఉన్నారు.


ఆచంట : జెండా ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఏ


**పెనుమంట్ర :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరి ఆత్మ గౌరవం కోసం ఆనాడు అధినేత ఎన్‌టిఆర్ స్థాపించిన టిడిపి ఎప్పటికీ స్థిరంగా ఉంటుందని పలువురు టిడిపి నేతలు అన్నారు. శనివారం మండలంలోని మార్టేరు, నెగ్గిపూడి, పెనుమంట్ర, పొలమూరు, జుత్తిగ, నత్తారామేశ్వరం, గరువు, ఎస్ఐ పర్రు తదితర గ్రామాల్లో టిడిపి మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**పెనుగొండ :** మండలంలోని వడలి గ్రామంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ అధ్యక్షుడు టిడిపి మిత్రపక్షాల సమక్షంలో పతాకావిష్కరణ గావించి టిడిపి వ్యవస్థాపకుడు, కీర్తిశేషులు ఎన్‌టి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల కాలంలో అధికారం చేపట్టిన ఏకైక పార్టీ టిడిపి అని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**తణుకు :** పట్టిన జెండా దించకుండా టిడిపి ఏ పిలుపు ఇచ్చినా ఆ పిలుపును అమలు చేస్తూ పార్టీయే పరమావధిగా భావించిన కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషిచేస్తున్నారని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. 43 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ పార్టీకు సేవలు అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు, సీనియర్ నాయకులు పచ్చిపాల కృష్ణమూర్తి, ఒమ్మి రాంబాబు, పంపన పద్మారావు, దంపనబోయిన శేషగిరి, తాతపూడి మారుతీరావు, నల్ల భాస్కరరావు, టి.సత్యనారాయణలను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నరసాపురం :** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక రాయిపేట మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు కార్యాలయంలో పార్టీ కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు పార్టీ జెండా ఎగురవేసి కీర్తిశేషులు ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఈద సురేష్ బాబు, కొట్టు పండు, కొండేటి శ్రీను, బస్వాని ఏడుకొండలు, రేవు ప్రభుదాసు, గుబ్బల వీరస్వామి, పొలిశెట్టి సత్తిబాబు, నడిపూడి శ్రీను(బుల్లెట్ శ్రీను) పాల్గొన్నారు.

**ఆచంట :** ఆచంటలో నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజవర్గ టిడిపి పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, పార్టీ మండల అధ్యక్షులు కేత వీరయ్య, జెడ్‌పిటిసి ఉప్పలపాడు సురేష్ బాబు, ఎంపిపి దిగిమర్తి సూర్య కుమారి, బీరా నరసింహమూర్తి, గొడవర్తి శ్రీరాములు, నెక్కంటి ప్రభాకర్, గణపతినీడి రామమోహన్, తమ్మినేడి ప్రసాద్, కేతా మురళీ పాల్గొన్నారు.


తణుకు : సీనియర్ నాయకులను సత్కరిస్తున్న ఎంఎల్ఏ రాధాకృష్ణ

**ఉండి :** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ శనివారం ఘనంగా నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చెరుకువాడ గ్రామ అధ్యక్షులు ఇర్రింకి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మాన్యం నరసింహమూర్తి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలలో టిడిపి గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలపై దుష్ప్రచారం తగదు

### వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

**పాలకొల్లు :** ఉపాధి హామీ కూలీలు ఉదయం 9 గంటలకే పని ప్రాంతంలో ఉండటం లేదనే దుష్ప్రచారం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం పాలకొల్లు ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పని గంటలు అనేది లేని విషయాన్ని 5 గంటలు పనిచేయాలని జిల్లా డ్వామా పీ డీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విజన్ 2047లో ఉపాధి కూలీల ఊసే లేదన్నారు. ఆయన చెప్పినట్టుగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల బతుకులు మారాలంటే ప్రతి కుటుంబానికి 2 ఎకరాలు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి-4 సర్వే ఫలితం పేదలకు ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని దూరం చేయడమే అన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ రక్షణకు బడ్జెట్లో నిధులు పెంచి వేతనాలు రూ.600, పనిదినాలు 200 రోజులు పెంచి పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, శేషపు అశ్రీయ్య, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, పూతినీడి పద్మ, గుబ్బల నాగేశ్వరరావు, షేక్ పాదుషా, మూడే మోజేష్, నేతల నాగేశ్వరరావు, యడ్ల మోహన్‌రావు, పోతుల మృత్యుంజయ పాల్గొన్నారు.

## కౌలు రైతులను ప్రభుత్వమే గుర్తించాలి

### సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు

**పెనుమంట్ర :** ఆరుగాలం శ్రమించే కౌలు రైతులను భూ యజమానులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే గుర్తించాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మార్టేరు దేవాంగుల కళ్యాణ మండపం హాల్లో జరిగిన మండల కౌలు రైతుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొని కీలక ప్రసంగం చేశారు. సభకు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పంట రుణాలతో పాటు పంట నష్టం వాటిల్లితే బీమా కౌలు రైతులకు ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లలో మోసాలు అరికట్టాలని, ధాన్యంలో తేమశాతం, నూక శాతం పేరిట జరిగే మోసాలు అరికట్టాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎపి కౌలురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, కౌలురైతు నేతలు సారిపల్లి శ్రీనివాస్, రాపాక వెంకటేశ్వర్లు, బొంతు శ్రీనివాస్, కేతా పుల్లారావు, కౌరు శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ఏప్రిల్ 1న మొదలు పెట్టి 15వ తేదీ లోపు అన్ని గ్రామాల్లో కౌలు రైతుల్ని సభ్యులుగా చేర్చాలని సూచించారు.

## అంబేద్కర్ విగ్రహం తరలిస్తే ఊరుకోం

### దళిత సంఘాల నేతల నిరసన

**ఆచంట :** అంబేద్కర్ విగ్రహాన్ని తరలిస్తే గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతలు దారితీస్తాయని శనివారం సంఘస్తులు ఆచంట సబ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరమణ, మండల తహశీల్దార్ జి.కనకరాజులకు వినతి పత్రం అందజేశారు. విగ్రహాన్ని ఉన్నచోటనే ఉంచాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. వివరాల్లోకెళితే.. మండలంలోని వల్లూరు గ్రామ శివారు చిల్లేవారిపాలెంలో 2017వ సంవత్సరంలో బత్తుల విద్యాసాగర్, బత్తుల జనార్ధన్, తండ్రి బత్తుల బ్రహ్మమూర్తి, సంఘస్తుల ఆర్థిక సహాయంతో పాలెంలోని అందరూ కలిసి ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ 7 సంవత్సరాలు కావస్తుంది. ఈనేపథ్యంలో కొందరు గ్రామస్తులు ఇక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని మరొక చోటుకు తరలించాలని ప్రయత్నిస్తున్నారు. అంతే కాకుండా విగ్రహ ధ్వంసానికి కూడా పాల్పడుతున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో 2017లో సంఘస్తులు నిర్ణయించిన(స్థలంలో) ఎవ రికి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా నిర్మించిన విగ్రహాన్ని మరొక చోటుకు మార్చవలసిన అవసరం ఏమి వచ్చిందని, అంబేద్కర్ విగ్రహాన్ని మారిస్తే గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతలు దారితీస్తాయని వినతిని అందజేశారు. విగ్రహం తరలిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి

**పెనుమంట్ర :** విద్యుత్ వినియోగదారులను ఇబ్బంది పెట్టే స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మార్టేరు ఉప విద్యుత్ కేంద్రం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మార్టేరు విద్యుత్ సబ్ స్టేషన్లో సిబ్బందికి వారు వినతి పత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఎం జిల్లా నాయకులు ఆకుల హరే రామ్, సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

## నేడు శాంతి ర్యాలీ

**నరసాపురం:** ఛలో నరసాపురం శాంతి ర్యాలీ జయప్రదం చేయాలని పాస్టర్ రూబెన్ అన్నారు. శనివారం నరసాపురం పట్టణంలో స్టేషన్ పేట ఫైయిత్ హోమ్‌లో ఛలో నరసాపురం శాంతి ర్యాలీ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 25న రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి మైయిన్ రోడ్డు, గాంధీ బొమ్మ సెంటర్, పాత బజార్, పంజా సెంటర్, లూథరన్ చర్చ్ మీదగా అంబేద్కర్ సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకిలేటి ఆనంద్, ఆడిదల శరత్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

**భీమవరం టౌన్ :** ఈ ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య అని, విద్య ద్వారానే పేదరిక నిర్మూలన, అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో శనివారం మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 82 మంది విద్యార్థులకు రూ.7 లక్షల స్కాలర్ షిప్ చెక్కులను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ఈ ఏడాది భారతదేశ వ్యాప్తంగా 21 వేల మంది బాలికల విద్యకు మద్దతుగా రూ.16 కోట్లను కేటాయించడం, ఆంధ్రలోని 142 కళాశాలల్లో చదువుతున్న 1,928 మంది బాలికల విద్యకు మద్దతుగా రూ.1.67 కోట్లు కేటాయించడం గొప్ప విశేషమని అన్నారు. మలబార్ గ్రూపు లాభాలలో 5 శాతం విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పేదరిక నిర్మూలన వంటి సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం అభినందనీయమని తెలిపారు. భీమవరం స్టోర్ హెడ్ ఇంతియాజ్ మాట్లాడారు. అనంతరం 82 మంది విద్యార్థులకు రూ.7 లక్షల స్కాలర్ షిప్ చెక్కులను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

**మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో**
**ఇ.పి.నెం. 9/2024 ఇన్ ఓ.యస్.నెం. 375/2018**

బిట్వీన్ :
పెద్దిరెడ్డి సోమేశ్వరరావు ...డి.హెచ్.ఆర్
మరియు
1) జోగి అక్కులు @ పెద్ద అక్కులు
1) జోగి వెంకటేశ్వరమ్మ ...జె.డి.ఆర్స్

పై నెంబరు గల గ్రంథములో జె.డి.ఆర్స్., డి.హెచ్.ఆర్ గారికి చెల్లించవలసిన బాకీ వసూలు నిమిత్తం ఈ క్రింది పేర్కొన్న షెడ్యూల్ ఆస్తిని శ్రీ కోర్టువారు బహిరంగ వేలం వేయుటకు గానూ పేపర్ పబ్లికేషన్ ఆర్డర్ వేసియున్నారు. కావున సదరు ఆస్తిని **ది. 15-04-2025వ తేదీన** దావా ఆస్థిని అమ్ముటకు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో బహిరంగ వేలం జరుపబడును. ఔత్సాహిక కొనుగోలు దారులు పై కోర్టువారి ఎదుట **ఉదయం గం॥ 10-30 ని॥లకు** వారి యొక్క ఐడింటిటీ తో వేలంలో పాల్గొని షెడ్యూల్ ఆస్థిని పొందగలరు.

**షెడ్యూల్: ఐటమ్ నెం.1**

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ లో చేరిన పూళ్ళ గ్రామములో Extent of 202.2/9 చ.గజములలో గల సైట్, ఆర్.సి.సి. బిల్డింగ్ డోరు నెం. 10-137, సర్వేనెంబరు 463 హద్దులు:-
తూర్పు - కొండేటి హరిచంద్రరావు గారి భూమి
దక్షిణం - జోగి గంగరాజు స్థలము
పడమర - రాజవీధి
ఉత్తరం - జోగి పోతురాజు గారి ప్రహరీ గోడ
**డి.హెచ్.ఆర్ విలువ రూ. 3,00,000/-**
**అమీనా విలువ రూ. 4,02,000/-**

**షెడ్యూల్: ఐటమ్ నెం.2**

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, భీమడోలు సబ్ రిజిస్ట్రార్ లో చేరిన పూళ్ళ గ్రామములో A.C. 0.43 సెంట్లు భూమి ఆర్.యస్.నెం. 464 కు హద్దులు:-
తూర్పు - జోగి పోతురాజు గారి భూమి
దక్షిణం - గోపాల వెంకటేశ్వరరావు గారి భూమి
పడమర - గోపాల వెంకటేశ్వరరావు గారి భూమి
ఉత్తరం - పసుమర్తి నాగేశ్వరరావు గారి భూమి
**డి.హెచ్.ఆర్ విలువ రూ. 10,00,000/-**
**అమీనా విలువ రూ. 8,60,000/-**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**జి.వి. ప్రసాద్ బాబు**
**కె. ఆంజనేయులు**
**జి. సంజయ్ బాబు**
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు
ది.29-3-2025 సెల్ నెం: 99854 24304

**మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి ఏలూరు వారి కోర్టులో**
**I.A.No. 412/2024 in O.S.No. 83/2015**

బిట్వీన్:-
కూనలక్ష్మి మరియు వగైరాలు
...పిటీషనర్లు/1.3 to 5 ప్రతివాదులు
మరియు
కె. హరినాధబాబు మరియు వగైరాలు
...రెస్పాండెంట్లు/వాది/02

పై నెంబరు గ్రంథమును పిటీషనర్లు, రెస్పాండెంట్ల పై దావా షెడ్యూలు దాఖలా ఆస్థిపై **ది.7-04-2012వ తేదిన** జరిగిన Sale Agreement ను Rescission చేయవలసినదిగా పై కోర్టులో దాఖలు చేసియున్నారు. దానిపై 4 to 6 రెస్పాండెంట్లు అయిన
R4. కూన విజయకుమార్, S/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.
R5. పొట్ట శ్రీదేవి, D/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.
R6. గుడవల్లి హిమబిందు, D/o. (లేటు) రాము, D.No. 672, పోణంగిరోడ్, YSR కాలనీ, 13 th రోడ్, ఏలూరు, ఏలూరు జిల్లా, A.P.

అనువారలకు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.23-04-2025వ తేదీ ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**శ్రీ పర్వతనేని పూర్ణచంద్రజోషి**
ఏలూరు న్యాయవాది
తేది:26-03-2025 ఏలూరు - 2
సెల్: 98481 73333

**గ్రామపంచాయతి కార్యాలయం, కొండూరు**
**టెండరు ప్రకటన**
ఆర్.సి.నెం.01/2025 తేది.11-03-2025

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కొండూరు గ్రామ పంచాయితీ యందు 2025-26 సం॥నకు కాంట్రాక్ట్ లేబర్ పద్ధతిపై ఈ దిగువ తెలిపిన పనులు నిర్వహణకు గాను సీల్డు టెండర్లు ది. 17-03-2025 తేది ఉదయం 11.00 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. మిగిలిన విషయములు ఈ కార్యాలయం పని వేళల యందు కోరి పొందవచ్చును.

| వ.నెం. | పని వివరము | పని కాలము | ధరావత్తు |
|---|---|---|---|
| 1 | స్వీపర్ | 01-04-2025 నుండి 31-03-2026 వరకు అనగా ఒక సంవత్సర కాలం | రూ. 1000/- లేక సాల్వెన్సీ |
| 2 | పిట్టర్ | ॥ | ॥ |
| 3 | ఎలక్ట్రీషియన్ | ॥ | ॥ |

కార్యదర్శి వారి నోట్: గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు పంచాయితీ నిల్వలను బట్టి పేమెంట్ జరుపబడును.

సం/- **బొర్రా వెంకట లక్ష్మి**
సర్పంచ్, కొండూరు గ్రామపంచాయితీ
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **పి. పాండురంగారావు**
గ్రామపంచాయితీ కార్యదర్శి, కొండూరు
కలిదిండి మండలం, ఏలూరు జిల్లా.

## ముగిసిన లోకల్ ట్రైనింగ్ క్లాసులు

**గణపవరం :** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సరిపల్లిలో జరుగుతున్న లోకల్ ట్రైనింగ్ క్లాసులు శనివారం ముగిసాయి. సరిపల్లిచెత్త సంపద తయారీ కేంద్రంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవిచంద్ర, గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై అధికారులందరూ దృష్టి పెట్టి గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండేవిధంగా, పారిశుధ్య నిర్మూలన చేయడానికి లోకల్ క్లాసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం, ఉండి ఇఒపిఆర్‌డిలు పి.సత్యనారాయణ, సిఎస్‌వి.రెడ్డి పాల్గొన్నారు.

**మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**EP 9/2022 IN OS 379/2018**

బిట్వీన్ :
భాగవతుల గోపాలకృష్ణమూర్తి ...DHR.
అండ్ :
సూరిశెట్టి లావణ్య మరి ఒకరు ...JDRS
**ఆర్డర్ 21 రూల్ 64 నోటీసు**
టు,
**1వ JDR:-**
**సూరి శెట్టి లావణ్య** D/o అప్పలనాయుడు.
D.No 1-144/1, కృష్ణ గుడి దగ్గర కలపర్రు, పెదపాడు మండలం, భీమవరం వెస్ట్, గోదావరి జిల్లా.

పై నెంబర్ EPలో శ్రీ కోర్టు వారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే.29-4-2025దికి వాయిదా** వేసి ఉన్నారు. కావున ఆరోజు **ఉదయం 10:30 నిమిషములకు** మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేవణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబర్ EP తీర్మానించబడును.

**చందక వీర కృష్ణ,**
**D.సుబ్రహ్మణ్యం**
**అడ్వకేట్స్,** అనకాపల్లి.

**మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**Debtor I.P No: 11/2025**

Petitioner's (పిటిషనర్లు) / Debtors ( రుణగ్రహీతలు ) :
1.M/s. Murahari Silkhs, a Proprietorship, Rep. by Murahari Lakshminarayana, GSTIN: 37BNCPM7796K1Z6,
2.Murahari Lakshminarayana,
3.Murahari Venkata Satya Naga Siva Prasad,
4.Murahari, Srinivasarao
Respondent's (ప్రతివాదులు) / Creditors (రుణదాతలు ):
1.Mukala Satyanarayana , Bhimavaram
2.Grandhi Satya Rani , Bhimavaram
3.Vijjuroti Parvathi , Bhimavaram
4.Aitam Narasimhamurthy , Bhimavaram
5.Mode Srinivasarao , Yanamadurru
6.Mukala Vara Lakshmi , Bhimavaram
7.Vasireddy Rama Chandra Prasad , Bhimavaram
8.Suragani Sunitha , Bhimavaram
9.Suragani Priya , Bhimavaram
10.Uddaraju Lakshmi , Bhimavaram
11.Uddaraju Prasanna Vara Lakshmi , Bhimavaram
12.Uddaraju Devi Priyanka , Bhimavaram
13.Bachala Adi Narayana , Bhimavaram
14.Gade Subbarao , Bhimavaram
15.Singamsetti Kiran Kumar , Bhimavaram
16.Srikakulapu.srinivasu, Gannavaram
17.Sikakulapu Krishnarao , Gannavaram
18.Satyavarapu Narendra Kumar, Kothapeta
19.Gadamsetti Kanaka lakshmi, Bhimavaram
20.Srinivasa curten furnishings, Bhimavaram
21.Vemula Narasimha rao, Bhimavaram
22.Sree Sai ram Rice merchants, Bhimavaram
23.Tanniru Madan Babu, Bhimavaram
24.Tanniru Venkatarao, Bhimavaram
25.Gadiraju Prashanthi, Bhimavaram
26.Gadiraju satyavathi , Bhimavaram
27.Aruva Ushanna & Bros, Gadwal & Kothakota Handloom jari sarees Merchants ,HYD
28.Andhra Cotton Kendra-(2023-2024) , Chirala
29.V.M.SILKS, Coimbatore
30.VIGNARAJA Textile Agencies , Surat
31.SAMALA CHALAPATHI HANDLOOMS ,Venkatagiri
32.VIJAYA LAKSHMI SILKS, Bangalore
33.CHINTAN TEXTILES, Bhiwandi
34.Sri Durga Palace, Vijayawada
35.SANGAM SHREE COLLECTIONS PVT LTD, Kolkata
36.GANPATI SAREES, Kolkata
37.VAISHNABI Creation, Kolkata
38.Raghani Trade link, Kolkata
39.V.C FASHION, Kolkata
40.VISHAL COLLECTION PVT LTD, Kolkata
41.RAJSHREE CREATIONS PVT LTD, Kolkata
42.ARPITA FASHIONS, Kolkata
43.RT FASHION PRIVATE LIMITED, Kolkata
44.RISHAB CREATIONS, Coimbatore
45.Kala Sangam Sarees (P) Ltd, Varanasi
46.NAZIA EXTENSION, Varanasi
47.SILKEN INDIA, Varanasi
48.NAZIM TRADING CO. PVT. LTD, Varanasi
49.SHAHNAZ COLLECTION, Varanasi
50.TABA KASHI PRIVATE LIMITED, Varanasi
51.AJMAL KAIFI, Varanasi
52.MANISH KUMAR MANOJ KUMAR SAREES PVT LTD, Varanasi
53.ROYAL Sarees, Varanasi
54.SRI MUKUND FASHION PVT LTD, Varanasi
55.INDIA SILK MART 22-23, Varanasi
56.NAZEER SONS, Varanasi
57.Sagun creation, Varanasi
58.ANIS IMPRESSIONS, Varanasi
59.ANCHAL, EXCLUSIVE BANARAS SAREES, Varanasi
60.V.RADHA KRISHNA MURTHY, Mumbai
61.PAYAL SAREES, bangalore
62.V.SENTHIL KUMAR & CO, Satyamangalam
63.Deepak Creations Pvt Ltd, Coimbatore
64.SRI SAI PRINTS,Kukatpally
65.SIDHI SILK CREATIONS, Darmavaram
66.K.K.TEX, Vijayawada
67.Bhimavarapu Suresh Kumar, Bhimavaram
68.Kiran Agencies Rep by Narayana, Prodhutur
69.The official receiver, Eluru

**Petitioner's (పిటిషనర్లు) / Debtors ( రుణగ్రహీతలు)**
**తరపున దాఖలు చేసిన పత్రిక ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయనది ఏమనగా నా క్లయింట్‌లు వ్యాపారములో నష్టపోయిన కారణంగా ఎవ్వరికీ డబ్బులు చెల్లించలేని పరిస్థితుల కారణంగా పై నెంబర్ గల I.P దావాను భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో వేసినారు. దావాలో రెస్పాండెంట్స్ ((క్రెడిటర్స్)/ప్రతివాదులకు శ్రీ గౌరవనీయులైన కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం పత్రిక ప్రకటన ద్వారా సబ్ స్టిట్యూట్ సర్వీస్ నిమిత్తం కోర్ట్ వారు ఉత్తర్వులు జారీచేసినారు. మీరూ **ది: 10-04-2025వ తేదినా ఉదయము 10.30 గం॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై స్వయముగా కాని న్యాయవాది ద్వార గాని మీ యొక్కా ఆక్షేపణలను తెలియచేసి కోవలెను, లేని యెడల సదరు నంబరు I.P దావా న్యాయస్థానం వారు మీ పరోక్షణమున తీర్మణించెదరు అని తెలియజేయడమైనది
(By Order of the Hon'ble Court)

**VEMULA MURALI,**
M.A, M.A, B.C.A, L.L.B, L.L.M (Const)
Advocate, Bhimavaram-1,
Cell No: 7989068025
**M.LAVANYA,**
BCom, M.B.A, L.L.B, L.L.M (Labour)
Advocate, Bhimavaram-1,
Cell No: 8143994499
Bhimavaram,
Date: 29-03-2025